

జర్నలిస్ట్‌ల సంక్షేమానికి కృషి

తిరుపతి ప్రెస్‌క్లబ్ నూతన భవన నిర్మాణానికి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. - 8లో



సెప్టెంబర్‌లో కాణిపాకం బ్రహ్మోత్సవాలు

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	38	26
చిత్తూరు	37	25
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	38	26

న్యూస్‌రీల్

ముక్కంటికి వెండి పాత్ర వితరణ



వెండి పాత్ర అందిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం విశాఖపట్నానికి చెందిన రామమూర్తి, కుటుంబ సభ్యులు రూ.65వేల విలువైన 700 గ్రాముల వెండి పాత్రను వితరణ చేశారు. ఈ మేరకు పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు అందజేశారు. ఆయన దాతలకు కృతజ్ఞతలు తెలిపి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 81,472 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 34,820 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.90 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్నిశాఖల ఉన్నతాధికారులు స్పందనకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యాలయంలోనే ఉంటూ సబార్డినేట్‌లను పంపితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.


9 వరకు ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

తిరుపతి సిటీ : ఎన్‌సీసీ 35 ఏ బెటాలియన్ క్యాడెట్లకు ఈ నెల 9వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగనున్నట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ అజయ్ బార్నెట్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జూలై 31న ప్రారంభమైన ఈ శిబిరంలో చిత్తూరు, అన్నమయ్య, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల నుంచి ఎంపిక చేసిన సుమారు 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారని వివరించారు. లైవ్ ఫైరింగ్, సిమ్యూలేటెడ్ ఫైరింగ్, వెపన్ ట్రైనింగ్, డ్రిల్ తదితర పోరాట విన్యాసాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన క్యాడెట్లకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న థాల్ సేన క్యాంప్, రిపబ్లిక్ డే క్యాంప్‌లో పాల్గొనే అవకాశముంటుందని వెల్లడించారు.

రేపటి నుంచి నామినేషన్లు

నారాయణవనం/తిరుపతి అర్బన్ : జిల్లాలోని పంచాయతీల్లో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం నుంచి గురువారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలని ఆదేశించింది. 11న పరిశీలన, 13న అపీలు, 14వ తేదీ మధ్యాహ్నం 3 వరకు ఉపసంహరణ అనంతరం 5 గంటలకు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించాలని సూచించింది. 19వ తేదీ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి అదే రోజున ఫలితాలను ప్రకటించాలని పేర్కొంది. అవసరమైన స్థానాల్లో 20వ తేదీన రీపోలింగ్ జరిపించాలని కోరింది. రాష్ట ఎన్నికల అధికారి నీలం సహానీ ఉత్తర్వులు చేశారు.

మహిళా వర్సిటీలో ఫ్యాషన్ షో



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ భారతి

తిరుపతి సిటీ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో హోమ్ సైన్స్ విభాగంలోని బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ డిజైనింగ్ కోర్సు విద్యార్థినులు ఆదివారం ఫ్యాషన్ షో నిర్వహించారు. మొదటి ఏడాది కోర్స్ సిలబస్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా వీసీ భారతి హాజరై విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.బిందు, ప్రొఫెసర్ ఎం.అరుణ, అధ్యాపకులు రఫియ సుల్తానా, దేవి, హబీబుల్లా పాల్గొన్నారు.

ఇదీ ప్రజల సంకల్పం!

అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. వ్యవసాయానికి సకాలంలో సాగునీరు అందించే దిశగా ప్రాజెక్టులకు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోంది. ఏటా ఆయకట్టును విస్తరించేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. ఎక్కడికక్కడ రిజర్వాయర్లు నిర్మించేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. రైతు సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతోంది.

- తిరుపతి జిల్లాలో ప్రాజెక్టుల పరవళ్లు
- ఆల్తూరుపాడు రిజర్వాయర్ విస్తరణ
- రూ.553 కోట్లు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సోమశిల కాలువ, మల్లిమడుగు, బాలాజీ రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు
- అదనంగా మరో 2.9 లక్షల ఎకరాలకు సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మల్లిమడుగు రిజర్వాయర్

తిరుపతి అర్బన్: ప్ర'జల సంకల్పం' నెరవేరుతోంది. తాగు, సాగునీటి అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. జిల్లాలో కొత్త ప్రాజెక్టుల స్థాపనకు ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తోంది. గత టీడీపీ పాలనలో తమ అనుచరులకు అక్రమంగా దోచిపెట్టేందుకు ఆహ్వానించిన టెండర్లను రద్దుచేసింది. మేర్లపాక రూ.250, ఆల్తూరుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ రూ.110తోపాటు ఆల్తూరుపాడు రిజర్వాయర్ రూ.280, మూలకాలువ ప్రాజెక్టు రూ.40 కోట్లకు సంబంధించి రివర్స్ టెండర్ల ద్వారా రూ.680 కోట్ల ప్రజాధనాన్ని కాపాడగలిగింది.

అన్నదాతలకు వరం ఆల్తూరుపాడు రిజర్వాయర్

డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్ అన్నదాతకు వరం కాబోతుంది. ఇటీవల ఈ రిజర్వాయర్‌ను పూర్తి చేయడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.553 కోట్లు కేటాయింపులు చేశారు. తద్వారా 90 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అటవీ సమస్యల పరిష్కారానికి అధికారులు సర్వేలు చేపట్టి సమస్యను కొలిక్కి తీసుకొచ్చారు. 1 టీఎంసీ నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యంతో ఈ రిజర్వాయర్‌ను పూర్తిచేయనున్నారు. సోమశిల నుంచి కండలేరుకు వెళ్లే మార్గంలో 12వ కిలోమీటర్ వద్ద సోమశిల–మేర్లపాక కాలువ మార్గానికి నీటిని మళ్లించనున్నారు. మేర్లపాక కాలువ మార్గంలో 56వ కిలోమీటర్ వద్ద ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి మేర్లపాక లిఫ్ట్ కెనాల్‌కు నీటిని అందించడానికి త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నారు. మేర్లపాక లిఫ్ట్ ద్వారా మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్లకు 5–6 టీఎంసీల నీటిని పంపింగ్ చేయనున్నారు. అంతేకాకుండా 12 మండలాలకు నీటిని అందించనున్నారు. మరోవైపు తిరుపతి, తిరుమలకు తాగునీటిని సమకూర్చనున్నారు.

రూ.35 కోట్లతో అరణియార్ ఆధునికీకరణ

పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టు రెండు టీఎంసీల నీటి సామర్థ్యంతో నెలకొంది. 6వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. దీన్ని రూ.35 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. మరోవైపు తుడా ద్వారా రూ.1.82 కోట్లతో వ్యూటవర్, చిల్డ్రన్స్ పార్క్, బోటింగ్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. ఏటా 10లక్షల చేపపిల్లలను ఈ ప్రాజెక్టులో వదుతున్నారు. తద్వారా రెండు వేల మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తోంది.

ఉప్పొం'గంగ'

35 ఏళ్ల తెలుగుగంగ చరిత్రలో గత పాలకులు రెండో పంట (ఖరీఫ్‌నకు) నీళ్లు ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే నాలుగేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లోనూ గంగ నీటిని రెండో పంటకు ఇస్తున్నారు. దీంతో తిరుపతి జిల్లాలో 90 వేల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 60 వేల ఎకరాలు సాగులోకి వచ్చింది. గత పాలకులు రబీలో మాత్రమే 10 నుంచి 15 టీఎంసీల నీటిని సాగుకు ఇచ్చేవారు. దీంతో నెల్లూరు జిల్లాలో 65 వేల ఎకరాలు, తిరుపతి జిల్లాలో 55వేల ఎకరాలు మాత్రమే సాగుచేసేవారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక రబీ సీజన్‌లో 30 నుంచి 35 టీఎంసీలు ఇస్తున్నారు. దీంతో మొత్తం నెల్లూరు జిల్లాలో 1.05 లక్షల ఎకరాలు, తిరుపతి జిల్లాలో 1.02 లక్షల ఎకరాలకు సాగునీటిని సమకూర్చుతున్నారు.

విస్తరిస్తున్న మల్లెమడుగు

రేణిగుంట మండలంలోని మల్లెమడుగు రిజర్వాయర్‌ను విస్తరిస్తున్నారు. 2,230 ఎకరాల విస్తీర్ణంలోని ఈ రిజర్వాయర్ 21 అడుగుల లోతు ఉంది. నీటి మట్టం 14 అడుగులు. మల్లెమడుగు సమీపంలోని 14 చెరువులకు నీటిని నింపడంతో పాటు.. రబీలో 4,500 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 0.181 టీఎంసీ నుంచి 1.01 టీఎంసీకి పెంచారు. అంతే కాకుండా 1960లో ఏర్పాటు చేసిన సైఫన్‌లను తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. మరమ్మతులకు గురైన 47 సైఫన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరోవైపు 3 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న బాలాజీ రిజర్వాయర్ నీటిని అవసరమైన సందర్భాల్లో మల్లెమడుగు రిజర్వాయర్‌కు మళ్లించడానికి జోరుగా ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి, జీడీ నెల్లూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లోని 12 మండలాలకు సాగు, తాగు నీటిని సమకూర్చే విధంగా విధివిధానాలు రూపకల్పన చేశారు.

ఆ వెంటనే పనులు



అటవీ సమస్యలు పరిష్కరించిన వెంటనే టెండర్లు ఆహ్వానించి ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు చేపడుతాం. అలాగే సోమశిల–మేర్లపాక పనులు పూర్తిచేస్తాం. అనంతరం మేర్లపాక లిఫ్ట్ కెనాల్‌తో మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని అందిస్తాం. తెలుగుగంగ నీటిని వరుసగా నాలుగో ఏట ఖరీఫ్ సాగుకు అందించాం.

–వెంకటేశ్వర్లు, చీఫ్ ఇంజినీర్, జలవనరులశాఖ

ఆల్తూరుపాడుతో మహర్దశ



ఆల్తూరుపాటు రిజర్వాయర్ పూర్తిచేస్తే మా ప్రాంతం సస్యశ్యామలమవుతుంది. వేలాది ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయి. అంతేకాకుండా వందలాది గ్రామాలకు తాగునీటి సమస్య తప్పుతుంది. భూముల ధరలు నాలుగు రెట్లు పెరుగుతాయి. రైతు కూలీలకు ఉపాధి లభిస్తోంది. పాడి రైతులకు ఢోకా ఉండదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి.

– భాస్కర్‌రెడ్డి, రైతు, ఆల్తూరుపాడు గ్రామం



ఆల్తూరుపాడు రిజర్వాయర్



సోమశిల–మేర్లపాక కెనాల్



తెలుగుగంగ ప్రాజెక్టు



అరణియార్ ప్రాజెక్టు

ఆదర్శ క్షేత్రంగా బోయకొండ

వరాల దేవత శ్రీబోయకొండ గంగమ్మ ఆలయాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ పుణ్య క్షేత్రంగా గుర్తింపు తీసుకువచ్చేలా అభివృద్ధి చేయడమే ధ్యేయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చౌడేపల్లె మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బోయకొండ రూపు రేఖలను మార్చుతూ మాస్టర్ ప్లాన్ ఆధారంగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. బోయకొండలో రూ:12 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- రూ.12 కోట్లతో చేపట్టిన పనుల ప్రారంభోత్సవం
- రూ.50 లక్షలతో నిర్మించనున్న ఎకోపార్కుకు భూమి పూజ
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి



ఎకో పార్కుకు భూమిపూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: జిల్లాలో కాణిపాకం అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయాన్ని రూ.కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన గంగమ్మ గుడి వద్ద పలు ప్రారంభోత్సవాలు చేశారు. ఆర్చి నుంచి గంగమ్మ ఆలయం వరకు రూ.9.54 కోట్లతో చేపట్టిన తారురోడ్డును మంత్రి ప్రారంభించారు. బోయకొండ గంగాపురంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్యయంతో ఎకో పార్కు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. యాత్రికుల సౌకర్యార్థం రూ.38 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కల్యాణ కట్టను ప్రారంభించారు. రూ.32 లక్షల వ్యయంతో భవానీ నగర్ నుంచి ఆలయం వద్దకు ఏర్పాటుచేసిన విద్యుద్దీకరణ పనులను ప్రారంభించారు. రూ.22 లక్షల వ్యయంతో ఆమిని గుంట సమీపంలో గల ఆవుల చెరువు ఆధునీకరణ పనులను ప్రారంభించారు. వీటితో పాటు రూ.50 లక్షల వ్యయంతో పది గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బోయకొండ గంగమ్మ దర్శనానికి వివిధ రాష్ట్రాల భక్తులు వేల సంఖ్యలో తరలి వస్తున్నారని, సెలవురోజుల్లో రద్దీ అధికంగా ఉంటోందని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సదుపాలయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు బోయకొండ గంగమ్మ తల్లిని ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ మర్యాదలతో ఈఓ చంద్రమౌళి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఈఓ శేషవస్త్రం కప్పి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నేతలు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, ఎంపీపీ రామమూర్తి, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభిమాన నేతకు అభినందనలు







భూమనకు అభినందనలు తెలుపుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యేలు కిలివేటి, చెవిరెడ్డి





భూమనకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం తిరుపతి పద్మావతి పురంలోని ఆయన నివాసం అభిమానులతో కిక్కిరిసింది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాబు, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గంగమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల : మండలంలోని కె.వడ్డేపల్లె పంచాయతీలో వెలసిన దొనకొండ గంగమ్మకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆదివారం తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వీరికి స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవంతో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు ఆదినపల్లెలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందుకు హాజరయ్యారు. చెవిరెడ్డి మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతాలను చూడమని, అభివృద్ధి చేయడం మాత్రమే తమకు తెలుసన్నారు. అదే తమ బిడ్డ మోహిత్‌రెడ్డికి నేర్పించామని, ఆయన కూడా ప్రజాసేవలోనే పయనిస్తాడని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, నాయకులు కపిలేశ్వర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, గణేష్, రమేష్, ఈశ్వర్‌రెడ్డి, యశ్వంత్, మురళి పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై షణ్ముఖుని విహారం



ఊరేగుతున్న కుమారస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సూర్యప్రభ వాహనంపై స్వామివారు పురవిహారం చేశారు.భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

రౌడీ రాజకీయాలను సహించం



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రజాసంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని, బొజ్జల సుధీర్‌రెడ్డి రౌడీ రాజకీయాలను సహించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని పీఆర్ అతిథిగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీకాళహస్తి ప్రజలు 30 ఏళ్లపాటు బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి అవకాశమిచ్చారని, అయితే వారు అభివృద్ధి చెందారు కానీ, నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. చివరకు బొజ్జల సొంత ఊరైన ఊరందూరు ఎస్సీ, ఎస్టీ కాలనీలో రోడ్డు సైతం నిర్మించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే రోడ్డు నిర్మించామని వెల్లడించారు. కరోనా కష్టకాలంలో బొజ్జల కుటుంబం హైదరాబాద్‌లో చికెన్ తింటూ, ప్రజలందరూ ఇంట్లో ఉండాలని సందేశమిచ్చారని మండిపడ్డారు. కోవిడ్ సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అండగా నిలిచామన్నారు. మాస్కులు, గుడ్లు, శానిటైజర్లు పంపిణీ చేశామని తెలిపారు. తెలుగుగంగ కాలువలో కంటి ముందే వెళుతున్న నీరు వాడుకోక రైతులు తీవ్రంగా ఇబ్బంది పడేవారని, తాను గెలిచిన ఏడాది లోపే లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 1,200 ఎకరాలకు నీరు అందించినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో బొజ్జల వారు కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తికి వచ్చి బొట్టుపెట్టి ఓటేయాలని ప్రజలను ప్రాధేయపడుతారని, ఎన్నికలు అయిపోగానే తట్టాబుట్టా సర్దుకుని హైదరాబాద్‌కు చెక్కేస్తారన్నారు. వారి తాత ఎమ్మెల్యే నాన్న మంత్రి అని చెప్పుకుని రాజకీయాలు చేయాల్సిందేనని తనకంటూ ఒకరికి కూడా సాయం చేసిన దాఖలాలు సుదీర్‌రెడ్డి జీవితంలో లేవని విమర్శించారు. 20 ఏళ్లుగా ప్రజాసేవలోనే ఉన్నానని, నాలుగేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించే ప్రజలను ఓటు అడుగుతానని తెలిపారు. రౌడీయిజానికి సుధీర్ రెడ్డి పెట్టిందిపేరని, గతంలో మునిరామయ్య, మోహన్‌బాబుపై బాంబులతో దాడి చేసిన చరిత్ర ఉందని వివరించారు. చంద్రబాబు మీటింగ్ ఆపితే ప్రైవేటు సెక్యూరిటీతో దాడి చేస్తామని బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. శ్రీకాళహస్తిలో శ్మశానవాటిక నిర్మాణం, స్వర్ణముఖి ట్యాంక్‌బండ్ అభివృద్ధి, గ్రామాల్లో రింగ్‌రోడ్ల నిర్మాణం చేసిన ఘనత తమకు దక్కిందని చెప్పారు. పేదల అంత్యక్రియలకు రూ.10వేలు అందిస్తున్నామన్నారు. ముస్లిం వధువులకు మేనమామ సాంగ్యం ఇస్తున్నామని వెల్లడించారు. చంద్రబాబు ఆరోపణలపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

క్లుప్తంగా

మహిళల క్రికెట్ టోర్నీలో బౌలర్ల హవా


4 వికెట్లు పడగొట్టిన బౌలర్ వైష్ణవి

వెంకటగిరి : పట్టణంలోని తారకరామా మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న అండర్–15 మహిళల క్రికెట్ టోర్నీలో ఆదివారం బౌలర్లు సత్తా చాటారు. చిత్తూరు– కర్నూలు, అనంతపురం–కంబైన్డ్ (నెల్లూరు, కడప) జట్ల మధ్య జరిగిన పోటీల్లో బౌలర్లు చెలరేగారు. గ్రౌండ్–1లో చిత్తూరు– కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 25 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు క్రీడాకారిణి డి.వైష్ణవి 4 వికెట్లు పడగొట్టి ప్రతిభ చాటింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 15.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసి విజయం సాధించింది. ఇక గ్రౌండ్–2 లో అనంతపురం–కంబైన్డ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కంబైన్డ్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగి19.3 ఓవర్లలో 60 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతపురం జట్టు బౌలర్లు రోషనార, శారద, గౌతమి 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 7.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 61 పరుగులు చేసి గెలుపొందింది.

సెప్టెంబర్ 18నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు


శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 20 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించింది. తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలు, 11 రోజులు ప్రత్యేక బ్రహ్మోత్సవాలు(ఉభయదారులు) నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే ఉభయదారులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి సూచనలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలు, పార్కింగ్, ఉచిత భోజన వసతి, ప్రసాదాలు, పార్కింగ్, విద్యుత్ అలంకరణలు తదితరాల ఏర్పాట్లు ఆహా అనిపించేలా చేయనున్నట్లు వివరించారు. వాహన సేవలు తిలకించేందుకు వచ్చే భక్తులకు కూడా అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

సెప్టెంబర్ 18	వినాయక చవితి, పుష్ప కావళ్ల ప్రారంభం	
19న	ఉదయం ధ్వజారోహణం,	రాత్రి హంస వాహనం
20న	ఉదయం స్వర్ణ నెమలి వాహనం	
21న	రాత్రి మూషిక వాహనం	
22న	ఉదయం స్వర్ణ చిన్న శేష వాహనం	రాత్రి స్వర్ణ పెద్ద శేషవాహనం
23న	పగలు చిలుక వాహనం	రాత్రి వృషభ వాహనం
24న	రాత్రి గజ వాహనం	
25న	మధ్యాహ్నం రథోత్సవం	
26న	ఉదయం భిక్షాండి ఉత్సవం, తిరుకల్యాణం,	రాత్రి అశ్వవాహనం
27న	సాయంత్రం ధ్వజావరోహణం, ఉత్సవం,	రాత్రి ఏకాంతసేవ

ప్రత్యేక ఉత్సవాల వాహన సేవలు రాత్రి మాత్రమే

28న	అధికార నంది వాహనం
29న	రావణబ్రహ్మ వాహనం
30న	యాళి వాహనం
అక్టోబర్ 1వ తేదీ	విమానోత్సవం
02న	సూర్యప్రభ
03న	చంద్రప్రభ
04న	కామధేనువు
05న	కల్పవృక్షం
06న	పూలంగిసేవ
07న	పుష్పపల్లకి
08న	తెప్పోత్సవం

మిద్దె తోటలతో ఆరోగ్యకర ఉత్పత్తులు


రైతులను సత్కరిస్తున్న ఆర్గానిక్ మేళా నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : మిద్దె తోటల పెంపకం ద్వారా ఆరోగ్యకర ఉత్పత్తులు పొందవచ్చని రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మేనేజర్ ప్రభాకర్ తెలిపారు. తిరుపతిలోని టీటీడీ మైదానంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళా ఆదివారంతో ముగిసింది. ప్రభాకర్ మాట్లాడుతూ వ్యవసాయం పల్లెల నుంచి పట్టణాలకు విస్తరించిందన్నారు. ప్రజలకు మిద్దెలపై తోటలు పెంచాలనే ఆసక్తే ఇందుకు ప్రధాన కారణమన్నారు. మనమే సొంతంగా కూరగాయలు, పండ్లు, పూలు పండించుకోవడం ద్వారా సంతృప్తి కలుగుతుందని తెలిపారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు కుమార్ స్వామి మాట్లాడుతూ ప్రతి మిద్దెపై నేడు పంటలు కళకళలాడుతున్నాయన్నారు. మిద్దె తోటల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో సీటీజీ కోర్ కమిటీ సభ్యుడు నడింపల్లి కృష్ణ, రైతు సాధికార సంస్థ జిల్లా అధికారి మునిరత్నం, సీటీసీ కోర్ కమిటీ సభ్యుడు టీవీ మనోహర్, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు గంగాధరం పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులను, సీటీజీ సభ్యులను మేళా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

రేపు తిరుపతిలో 'యండమూరి' సెమినార్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్ లోని కౌటిల్య విద్యాసంస్థలో మంగళవారం సాయంత్రం 6గంటలకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పోటీ పరీక్షలపై ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ సెమినార్ నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 96981 23456, 0877–2222212 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


కుసుమ (ఫైల్)

సైదాపురం : మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు. కొమ్మిపాడు గ్రామానికి చెందిన వీఏఓ కుసుమ(40) తమ కుమారుడిని చూసేందుకు భర్త చిన్నగంగిరెడ్డితో కలిసి బైక్‌పై వెళుతుండగా ప్రమాదం జరిగింది. కుసుమ మరణించగా, చిన్న గంగిరెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రెస్ క్లబ్ కమిటీ


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- ప్రెస్‌క్లబ్ సొంత భవన నిర్మాణానికి రూ.10లక్షల విరాళం
- మెగా హెల్త్ చెకప్ క్యాంపులో 304 మందికి పరీక్షలు

తిరుపతి తుడా: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని, ప్రతిష్టాత్మక తిరుపతి ప్రెస్ క్లబ్‌కు సొంత భవనం నిర్మించేందుకు పూర్తి సహకారం అందిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ వద్ద మెగా హెల్త్ చెకప్ క్యాంపు ఏర్పాటు చేశారు. గుండె, రక్త సంబంధిత (రూ.2,950 ఖరీదైన 42 రకాల) పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ప్రజలతోపాటు జర్నలిస్టులు కూడా తమకు కుటుంబ సభ్యులే అన్నారు. ఖరీదైన వైద్య పరీక్షలను ఆధునిక వైద్య పరికరాలతో నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రస్తుత ప్రెస్ క్లబ్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. 30 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి ప్రెస్ క్లబ్‌కు సొంత భవనం లేకపోవడం అన్యాయమన్నారు.సొంత స్థలం సమకూర్చేందుకు సహకారం అందిస్తామని, తన ట్రస్ట్ నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు ముందుకు వస్తే మండలానికో ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. హెల్త్ చెకప్‌లో భాగంగా పరీక్షల రిపోర్టులు రెండు రోజుల్లో వస్తాయని, దీనిపై వచ్చే ఆదివారం ప్రముఖ వైద్యులతో మెగా మెడికల్ క్యాంపును నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో క్యాంపునకు పరీక్షల నిమిత్తం వచ్చిన జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయలాను కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డిని ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ వైద్య శిబిరంలో 304 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీహరి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి బాలచంద్ర, ఉపాధ్యక్షుడు విక్రమ్, జాయింట్ సెక్రటరీ ద్వారకానాథ్, దినేష్, ఈసీ మెంబర్స్ మహేష్, వరప్రసాద్, లావణ్య కుమార్, సంజీవి సునీల్, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల జిల్లా కమిటీ ఎంపిక


నూతన కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్ : హియరింగ్ దివ్యాంగ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆదివారం తిరుపతి రాస్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సంఘ సమావేశానికి ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ తిరుపతి అధ్యక్షుడు ఎస్.సురేష్‌బాబు వ్యవహరించారు. ఎన్నిక ఏకగ్రీవం కావడంతో నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడుగా కె. సుబ్రమణ్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సి.మహేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.ధనంజయులు, ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసులురెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.బాలాజీ, సహాయ కార్యదర్శిగా బి.చంద్రశేఖర్, కోశాధికారిగా ఎం.జగదీష్, నలుగురు సభ్యులుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.గిరిబాబు, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ తిరుపతి అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

గూడూరురూరల్ : పట్టణంలోని గమళ్లపాళెంలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద శనివారం రాత్రి సుమారు 60 ఏళ్ల పైబడిన గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ హజరత్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. అనారోగ్య కారణాలతో వృద్ధుడు మరణించి ఉండవచ్చని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా గాయకునికి సైకత నివాళి



గద్దర్ సైకత శిల్పాన్ని రూపొందిస్తున్న సనత్‌కుమార్

చిల్లకూరు: ప్రజాగాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట నాయకుడు గద్దర్‌కు ఆదివారం సైకత శిల్పి మంచాల సనత్ కుమార్ ఘనంగా నివాళి అర్పించారు. గద్దర్ మృతిని స్మరించుకుంటూ చిల్లకూరు మండలం తీగపాళెం సమీపంలోని సముద్రం ఒడ్డున గద్దర్ సైకత శిల్పాన్ని రూపొందించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

పిచ్చాటూరు : మండలంలోని కీళపూడిలో హేమావతి అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఆమె భర్త తిరుమలయ్య(29)ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీఎస్పీ కథనం మేరకు.. కీళపూడికి చెందిన ఏసు రెడ్డి కుమారుడు తిరుమలయ్యకు తమిళనాడుకు చెందిన హేమావతి(16)తో గత ఏడాది డిసెంబర్‌లో వివాహం జరిగింది. వ్యవసాయం చేస్తూ తిరుమలయ్య డ్రైవర్‌గా కూడా పనిచేసేవాడు. ఈ క్రమంలో కొత్త వాహనం కొనుగోలు చేసుకునేందుకు అత్తామామలను రూ.6లక్షలు అడిగాడు. తమకు అంత స్తోమత లేదని, త్వరలోనే పొలం తెగనమ్మి కొంత డబ్బులు సమకూరుస్తామని నచ్చజెప్పినా తిరుమలయ్య వినలేదు. దీనిపై హేమావతిని తీవ్రంగా వేధించడంతో మనస్తాపం చెందిన బాలిక ఇంట్లోని డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడు తిరుమలయ్యను శనివారం కేవీబీపురం మండలం కోటమంగాపురం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తె దుర్మరణం


ఘటనాస్థలంలో మునస్వామి మృతదేహం


మృతి చెందిన చిన్నారి మునెమ్మ

వరదయ్యపాళెం: ద్విచక్ర వాహనంలో సత్యవేడుకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో నాలుగేళ్ల కుమార్తెతో పాటు తండ్రి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌వై కాలనీ సమీపంలోని సత్యవేడు–కడూరు ప్రధాన రోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి కథనం.. సత్యవేడు మండలం, చెరివి గ్రామానికి చెందిన మునస్వామి, చెల్లమ్మ దంపతులు తమ కుమార్తె మునెమ్మతో కలిసి మోటారు బైకుపై ఆదివారం సాయంత్రం సత్యవేడు పట్టణానికి వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా వీకేఆర్‌వైకాలనీ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో వెనుక వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో మునస్వామి (29) అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య చెల్లమ్మ, కుమార్తె మునెమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మునస్వామి కుమార్తె మునెమ్మ (4) మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ పరారవ్వడంతో ఆ వాహనాన్ని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజావసరాలకే 'మాస్టర్ ప్లాన్'


మాస్టర్ ప్లాన్ వివరాలను చూపుతున్న డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ

- తిరుపతిలో ట్రాఫిక్ కష్టాలు తీర్చడమే లక్ష్యం
- అందరికీ ఆమోదయోగ్యంగా రహదారుల నిర్మాణం
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : ప్రజావసరాల మేరకే మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మిస్తున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్వీయూలో తలపెట్టిన రహదారులను అందరికీ ఆమోదయోగంగా రూపొందించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రణాళిక ప్రవేశపెట్టి, ఆచరణ విస్మరించారని ఆరోపించారు. ప్రస్తుతం తిరుపతిలో పెరిగిన రద్దీ మేరకు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అందులో భాగంగా మొత్తం 18 రోడ్లకు గాను ఇప్పటికే 14 రహదారుల నిర్మాణ పనులు చేపట్టామని, కొన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే ఎస్వీయూలో ప్రతిపాదించిన మూడు రోడ్లపై కొందరు రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేశారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే మాస్టర్ ప్లాన్ అమలుపై సీపీఎం, సీపీఐ, జనసేన తదితర పార్టీలతోపాటు, వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులను కలిసి అభ్యంతరాలను గుర్తించామన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరికీ మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మాస్టర్ ప్లాన్‌లోని గేట్–3 నుంచి వేయాలని భావించిన రోడ్డు కారణంగా కలిగే ఇబ్బందులు గుర్తించి తక్షణమే పనులు నిలుపుదల చేసినట్లు తెలిపారు. గేట్–5 ప్రతిపాదన 100 అడుగుల రోడ్డును అభ్యంతరం లేని విధంగా 80 అడుగులకే పరిమితం చేస్తున్నట్లు వివరించారు. అలాగే గేట్–1లో 80 అడుగుల ప్రతిపాదన రోడ్‌పై అభ్యంతరం వ్యక్తం కావడంతో దాన్ని బీసీ బంగ్లా ఎదురుగానున్న గ్యాస్ గోడౌన్ అనుకుని నిర్మించేలా డిజైన్ మార్పు చేశామన్నారు. ఈ రోడ్లను కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. భావితరాలకు ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో మాస్టర్‌ప్లాన్ రోడ్లపై చర్చించి ఆమోదం తెలపనున్నట్లు వివరించారు. అలాగే వర్సిటీలో తాగునీటి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, కో–ఆప్షన్ సభ్యుడు ఇమామ్ పాల్గొన్నారు.

అభినయ్ నిర్ణయం అభినందనీయం

ఎస్వీయూకు మేలు జరిగేలా మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని వర్సిటీ బోధన, బోధనేతర సంఘాల నేతలు రెడ్డి భాస్కర్‌రెడ్డి, మురళీరెడ్డి, శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లను పరిశీలించి, వర్సిటీలోని అన్ని వర్గాలతో చర్చించకుండా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం భావ్యం కాదన్నారు. వారం రోజులుగా తలెత్తిన వివాదాలను వరుసగా సమావేశాలు నిర్వహించి అభినయ్‌రెడ్డి పరిష్కరించారని వెల్లడించారు. అలాగే ఎస్వీయూ అభివృద్ధికి కార్పొరేషన్ నిధులతో సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో ఎస్వీయూ ఉద్యోగ సంఘాల నేతలు కిషోర్, ఆకేపాటి శివానందరెడ్డి, యువజన విభాగం నేత ఇమామ్ పాల్గొన్నారు.